క్లుప్తంగా

'తలనీలాల మాయం.. అక్రమార్కుడి గుర్తింపు'

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ యాకుబ్ బాబా దర్గాలో తలనీలాలను నిబంధనలకు విరుద్ధంగా టెండర్ లేకుండా మాయం చేసిన అక్రమార్కుడిని అన్నారం గ్రామానికి చెందిన అశోక్‌కుమార్‌గా గుర్తించినట్టు దర్గా సూపరింటెండెంట్ ముంతాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లుగా సుబ్బారావును ముందు ఉంచి తలనీలాలను అశోక్‌కుమార్ దర్గా నుంచి మాయం చేస్తున్నట్టు పేర్కొన్నారు. అశోక్‌కుమార్‌పై క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉన్నట్టు సూపరింటెండెంట్ వివరించారు.

రూ.లక్ష విరాళం



చెన్నారావుపేట: మండలంలోని పాపయ్యపేటలోని కంఠమహేశ్వర స్వామి ఆలయ సమీపంలో కల్లు విక్రయం కోసం షెడ్ నిర్మాణానికి గ్రామానికి చెందిన మడూరి మల్లమ్మ–వెంకటకిష్టయ్య జ్ఞాపకంగా మడూరి సమత–రాజు దంపతులు ఆదివారం గౌడ కుల పెద్దలకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామి, కుల పెద్ద మేడి ప్రభాకర్, కంఠ మహేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు బుర్ర సుదర్శన్ మాట్లాడారు. గౌడ కులస్తులు వర్షాకాలం, ఎండా కాలం కల్లు విక్రయించడంలో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. షెడ్ నిర్మిస్తే గీత కార్మికుల సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. విరాళం అందించిన దంపతులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు బండి రమేశ్, మేడి సుధాకర్, తాళ్ల సమ్మయ్య, వెంకన్న, రామగోని రవి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంత్ గాడ్గే జయంతి వేడుక



నర్సంపేట : పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద సంత్ గాడ్గే బాబా మహారాజ్ జయంతి వేడుకను ఆదివారం నిర్వహించారు. సంత్ గాడ్గే చిత్రపటానికి బీజేపీ నియోజకవర్గ నాయకుడు కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి బాల్నె జగన్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరిశంకర్, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, నాయకులు గుగులోతు స్వరూప, మల్లయ్య, శేఖర్, భానోతు రమేష్, దౌరుప్పుల శ్రీను, రాజ్‌కుమార్, పావిడాల రమేశ్, కొండయ్య, లక్ష్మినర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డిలను వారి తల్లి జయశ్రీ ఇటీవల మృతి చెందిన క్రమంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం పరామర్శించారు. తొలుత జయశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయ చందర్‌రెడ్డి, రత్నం సతీష్ సా, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రాయపర్తి : మండలంలోని పానిష్‌తండాకు చెందిన బానోతు వెంకన్న మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల కోసం ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పంపించిన రూ.3,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భద్రునాయక్, బానోతు రమేశ్, బానోతు బాలు, తదితరులు పాల్గొన్నారు.

బాలకుమారస్వామి జాతర



గంగారం : మండలంలోని మడగూడెం, కిష్టాపురం గ్రామాల్లో బాలకుమారస్వామి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బాలకుమారస్వామిని గద్దెలపై నిలిపి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గంగస్నానం ఆచరించారు. రాత్రి 2గంటలకు గుడి మెలుగుట కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీమకుమారుడు చుంచ రాజశేఖర్, పెద్దవడ్డెలు పెండకట్ల వంశీయులు, పడిగవడ్డెలు యాప వంశీయులు, తలపతులు చుంచ వంశీయులు, రావుల వంశీయులు జాతరను కొనసాగించడం ఆనవాయితీ.

నాణ్యతలేని బియ్యం వాపస్

- చలపర్తి గోడౌన్‌లో 15 వేల బస్తాల తనిఖీ
- తొలిసారిగా బీఆర్ఎల్ ప్రయోగం



చలపర్తిలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోడౌన్లు

దుగ్గొండి : ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు భోజనం అందించడానికి ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తోంది. ఇందుకోసం రైతుల నుంచి ధాన్యం సేకరించి సీఎంఆర్ పద్ధతిలో మిల్లర్ల నుంచి సన్న బియ్యం తీసుకుని నిల్వ చేస్తోంది. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా వచ్చిన సన్నబియ్యాన్ని నిల్వ చేయడానికి చలపర్తిలోని తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోడౌన్లను వినియోగిస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 9న నాణ్యతలేని బియ్యాన్ని గోడౌన్లలో దిగుమతి చేసుకుంటున్నారనే ఫిర్యాదుతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. 10న కలెక్టర్ సత్యశారద స్వయంగా పరిశీలించి నాణ్యతలేని రెండు లారీల బియ్యాన్ని దిగుమతి చేయకుండా బయటికి పంపించారు. అయితే సదరు మిల్లర్ నుంచి ఎన్ని లారీల బియ్యం గోడౌన్‌లో దిగుమతి అయ్యాయని ఆరా తీసి వాటిని వేరు చేయాలని ఆదేశించారు. 8 రోజులపాటు 15 వేల బస్తాలను తనిఖీ చేయగా 8 లారీల బియ్యం (4,480 బస్తాల బియ్యం)లో నాణ్యతలేదని గుర్తించి వేరు చేశారు. ఆ బియ్యాన్ని తిరిగి వాపస్ పంపించారు.

నాణ్యమైన బియ్యం చేర్చాలని ఆదేశాలు

ఆహార భద్రతా పథకం కింద ప్రజలకు ప్రతినెలా బియ్యం అందించడానికి ఎఫ్‌సీఐ ద్వారా కేంద్ర ప్రభుత్వం బియ్యం సేకరించడం పరిపాటి. మిల్లర్ల నుంచి సేకరించిన బియ్యం గోడౌన్‌లో దిగుమతి చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, రేషన్‌షాపులు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపే క్రమంలో బియ్యం నాణ్యతలో తేడా వస్తే బీఆర్ఎల్ క్లాజ్ కింద వాటిని సదరు మిల్లర్‌కు తిరిగి పంపించాలన్నది ప్రభుత్వ నిబంధన. తద్వారా తిరిగి నాణ్యమైన బియ్యాన్ని సదరు మిల్లర్ నుంచి సేకరించే అవకాశం ఉంటుంది. దీంతో బీఆర్ఎల్ క్లాజ్ కింద జిల్లాలో తొలిసారిగా నాణ్యతలేని బియ్యాన్ని గోడౌన్ నుంచి వెనక్కి పంపారు. నిర్ణీత సమయానికి మళ్లీ నాణ్యమైన బియ్యం గోడౌన్‌కు చేర్చాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది.

మిల్లర్ల గుండెల్లో రైళ్లు..

గోడౌన్‌లో బియ్యం దిగుమతి కాగానే పేమెంట్ వస్తుంది. ఇక తమ పని ముగిసిందని సంతోషించే మిల్లర్లలో ఆందోళన మొదలైంది. బియ్యంలో నాణ్యత లేదని వెనక్కి పంపుతుండడంతో వారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. సీఎంఆర్ కోసం



వెనక్కి పంపుతున్న నాణ్యత లేని బియ్యం (ఫైల్)

ధాన్యం అనివార్య కారణాల వల్ల ముక్కితే ఇక తమ పరిస్థితి ఏమిటని వారు మదనపడుతున్నారు. గోడౌన్ నుంచి ఎన్ని బస్తాల నాణ్యతలేని బియ్యాన్ని గుర్తించి బయటికి పంపారు, అవి ఎవరి మిల్లుకు చెందినవి అనే విషయాలపై ఏ అధికారిని సంప్రదించినా స్పందించకపోవడం గమనార్హం. ఏది ఏమైనా బియ్యం నాణ్యతపై కలెక్టర్ చొరవ చూపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో వంతెన నిర్మాణానికి చర్యలు



పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలోని సుద్దరేవుల ఆనకట్ట వద్ద త్వరలోనే వంతెన నిర్మాణానికి చర్యలు చేపడతామని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. ఆనకట్ట వద్ద వంతెన నిర్మించాల్సిన స్థలాన్ని ఆదివారం ఆయన సందర్శించి రైతులు, స్థానికులతో మాట్లాడారు. సుద్దరేవుల ఆనకట్ట కింది నుంచి రైతులు పొలాలకు వెళ్లే క్రమంలో పడుతున్న ఇబ్బందులు తొలగించే దిశగా చొరవ తీసుకుంటామని చెప్పారు. రెండ్రోజుల్లో ఇంజనీర్లను పంపించి వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన చేయిస్తామన్నారు. ఇంజనీర్ల నివేదిక ఆధారంగా పనులు ప్రారంభించి వచ్చే వానాకాలం నాటికి వంతెన నిర్మింపజేస్తామని భరోసా ఇచ్చారు.

పెద్దమ్మ ఆలయానికి భూమి పూజ

పాపయ్యపేటలో పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి భూమి పూజ చేసి మాట్లాడారు. గ్రామంలో కురుమ కులస్తులు వారి ఆరాధ్య దైవమైన పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి ఏర్పాట్లు చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. ప్రజలను చల్లగా చూడాలని పెద్దమ్మ తల్లిని ప్రార్థించారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, రామానంద్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, బండి హరీశ్, సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, కురుమ సంఘం పెద్దలు మండ రవి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పటిష్టంగా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

- ఆలయ ధర్మకర్త రవీందర్

నల్లబెల్లి : ఈనెల 26, 27 తేదీల్లో మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆలయ ధర్మకర్త తాటిపెల్లి రవీందర్ గుప్తా కోరారు. ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కమిటీపైనే ఉందన్నారు. తొలుత అర్చకుడు పెందోట మురళీ మోహనాచార్యులు ప్రత్యేక అర్చన పూజ నిర్వహించారు. అనంతరం ధర్మకర్త రవీందర్ ఆలయ కమిటీని ప్రకటించి శాలువాలతో సన్మానించారు. అధ్యక్షుడిగా గందె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సుధగాని ప్రమోద్, కోశాధికారిగా మార్త మార్కండేయ, ఉపాధ్యక్షుడిగా గుమ్మడి వేణు, సహాయ కార్యదర్శిగా బత్తిని మహేష్, సభ్యులుగా గుగ్గిళ్ల శ్రీనివాస్, పిన్నింటి మధూకర్‌రెడ్డి, గంగిశెట్టి నాగభూషన్, నానబోయిన రాజారాం, సట్ల శ్రీనివాస్, పాండవుల రాంబాబు, పడాల మురళి, మిట్టగడపల సాంబయ్య, శివనాత్రి శ్రీనివాస్, మాసంపల్లి అఖిల్, బొడ్డురెడ్డి ప్రతాప్‌రెడ్డి, తడుక వినయ్, ముత్యాల కుమార్, ముత్యాల రాజేందర్, చింతకింది పరంధాములు, రామిని సంతోష్, బొద్దుల నర్సయ్య, సామల వీరన్న ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుల 'పల్లె నిద్ర'



నల్లబెల్లి : మండలంలోని నారక్కపేట హైస్కూల్ ఉపాధ్యాయులు శనివారం రాత్రి పల్లె నిద్ర చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పిల్లలతో ఏర్పాటు చేయించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను తల్లిదండ్రులు తిలకించి హర్షం వ్యక్తం చేశారు. వాటి ఉపయోగాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లలిత విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు మరో నెల రోజుల్లో మొదలు కానున్న నేపథ్యంలో సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ



పర్వతగిరి : పరీక్ష కేంద్రంలో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

పర్వతగిరి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల ప్రవేశ పరీక్షను కలెక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులు, కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను పరిశీలించారు. పరీక్ష నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులాల్లో ఐదో తరగతి రెగ్యులర్ ప్రవేశాలతోపాటు 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం జిల్లాలోని 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు జిల్లా సమన్వయకర్త అపర్ణ తెలిపారు. 4,200 మంది విద్యార్థులకు 89.97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు. అనంతరం గురుకుల పాఠశాలలో కలెక్టర్ పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాలు, మెనూ ప్రకారం అందుతున్న ఆహారం తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భయం వీడితే ఏదైనా సాధించగలరని, లక్ష్యాన్ని ఎంచుకొని ఇష్టపడి చదివి పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌లో ప్రశాంతం

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ గ్రామంలోని సైనిక్ స్కూల్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన గురుకుల టీజీ సెట్ ప్రశాంతంగా ముగిసింది. స్కూల్‌లో 5 నుంచి 9వ తరగతుల వరకు 2025–26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించగా 326 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 302 మంది హాజరయ్యారని, 24 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ మీడియాకు తెలిపారు. పరీక్ష వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తహసీల్దార్ రాజారేణుక, ఎస్సై రఘుపతి ఏర్పాట్లను, బందోబస్తును ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీగా సుందర్‌రాజ్‌ను గెలిపించాలి

- మెపా రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్

చెన్నారావుపేట : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన సుందర్‌రాజ్ యాదవ్‌ను గెలిపించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ వాదాన్ని బలపర్చాలని ఆకాంక్షించారు. సుందర్‌రాజ్‌ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే విద్యారంగంలోని, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బాటలు పడతాయని చెప్పారు. సుందర్‌రాజ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, నాయకులు నీరటి రాజు, సింగారపు రామకృష్ణ, పొన్నం కృష్ణ, ప్రతాప్, అనిల్, రాజు, సాయిమల్లు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'హత్యా రాజకీయాలు సరికాదు'



వర్ధన్నపేట : హత్యా రాజకీయాలు సరికాదని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల రాజకీయ, పరువు హత్యలు చోటు చేసుకుంటుండడం సమాజాన్ని ఆందోళనకు గురి చేస్తోందన్నారు. భూపాలపల్లిలో రాజలింగాచారిని న్యాయస్థానంలో ఎదుర్కొలేకనే హత్య చేశారని ఆరోపించారు. సూర్యాపేటలో పరువు హత్య చోటు చేసుకోగా ఇరు కుటుంబాలు బజారున పడ్డాయని తెలిపారు. కులాంతర వివాహితులకు రూ.10 లక్షలు చొప్పున ప్రోత్సాహకం ఇవ్వడంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో రాజకీయ, పరువు హత్యలను నివారించేలా ప్రభుత్వం పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కంజర్ల సమ్మయ్య, చల్లా మిధున్, మునిగాల అరుణ్, చినపెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- టీయూఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



కార్డులు పోస్ట్ చేస్తున్న వెంకటేశ్వర్లు, తదితరులు

పర్వతగిరి : ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) మండల అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కల్లెడ పోస్టాఫీస్ వద్ద ఫోరం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కందికట్ల జయ ఆధ్వర్యంలో ఆదివారం పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యమకారుల పోరాటాలు, త్యాగాల వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటికీ గత ప్రభుత్వం ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ఉద్యమకారులకు ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టీయూఎఫ్ నాయకులు ముదురు నాగరాజు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేయండి

- రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం భాస్కర్‌రావు



ప్రచారం చేస్తున్న భాస్కర్‌రావు, నాయకులు

రాయపర్తి : నల్గొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని రిటైర్డ్ గెజిటెడ్ హెచ్‌ఎం రావుల భాస్కర్‌రావు కోరారు. మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడారు. రవీందర్ ఎమ్మెల్సీగా గెలిపిస్తే పెద్దల సభలో ప్రశ్నిస్తారని తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల నరేందర్‌రావు, క్రాంతి కుమార్, స్వామి, అల్లూరి సురేందర్, చింతనూరి ప్రభాకర్‌రావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ఖిలా వరంగల్ : వరంగల్ భట్టుపెల్లి రహదారిపై అమ్మవారిపేట క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఐనవోలు మండలం కొండపర్తికి చెందిన రాజు, పరశురాములు కాజీపేట నుంచి వస్తుండగా అమ్మవారిపేట క్రాస్ వద్ద వారి వాహనాన్ని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆ ఇద్దరు రోడ్డుపై పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి స్థానికులు తరలించారు.

శివరాత్రికి గుండం ఆలయం ముస్తాబు



గుండం శివాలయం

కొత్తగూడ: మహాశివరాత్రి పర్వదినం కోసం మండలంలోని గుండం శివాలయం సిద్ధమవుతోంది. పాకాల సరస్సును గుండంపల్లి గ్రామ శివారు ఆనుకుని పచ్చటి అభయారణ్యంలో కాకతీయ మహారాజు ప్రతాపరుద్రుడు నిర్మించిన ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రామప్ప తరువాత అంతే ప్రశస్త్యం కలిగిన ఆలయం ఇది. ప్రభుత్వం నుంచి ఏమాత్రం ఆదరణ లేకపోయినా స్థానికులు దాతల సహకారంతో ఆలయాన్ని కొద్దికొద్దిగా అభివృద్ధి చేసుకుంటు వస్తున్నారు. కొత్తగూడ, నర్సంపేట, ఖానాపూర్ మండలాల నుంచి భక్తులు మహాశివరాత్రి రోజు అధిక సంఖ్యలో గుండం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుంటారు.

ఆలయ విశిష్టతలు..

అన్ని ఆలయాలకు భిన్నంగా గుండం శివాలయం ఉంటుంది. పడమర దిశకు ప్రధాన ద్వారంతో ఆలయాన్ని నిర్మించారు. గర్భాలయంలో శివలింగం, ఉత్తరాణ వేంకటేశ్వరస్వామి, దక్షిణ దిశలో వీరభద్రుడిని నెలకొల్పి మధ్యలో కల్యాణ మండపం ఏర్పాటు చేశారు. కాకతీయ సామ్రాజ్యానంతరం పాడుబడిపోతున్న ఆలయంలో రామక్క అనే ఆదివాసి భక్తురాలు మహా శివుడికి పూజలు చేసేదని చరిత్ర. ఈ క్రమంలోనే గుండం రామక్క దేవాలయంగా ప్రసిద్ధి గాంచింది. శివరాత్రి సమయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాగాహారం రోజున రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆలయంలోని వేంకటేశ్వరస్వామికి భక్తుడు ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. దీంతోపాటు బద్ది పోచమ్మ ఆలయానికి నిధులు మరో భక్తుడు సమకూర్చినట్లు తెలిపారు. శివరాత్రికి జరిగే జాతరకు హాజరుకావాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఆలయ కమిటీ ఆహ్వానం అందజేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల విద్యాలయంలో 2003–04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న స్కూల్‌లో అంతా కలుసుకుని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. భవిష్యత్తులోనూ స్నేహాన్ని కొనసాగించాలని, ఆపద సమయాల్లో ఒకరికొకరు తోడుగా నిలవాలని నిర్ణయించుకున్నారు. నాడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం మోతె ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు రాజోజు రవీందర్, నూనె రాములు, బియ్యాల సతీశ్, పిట్టల కుమారస్వామి, దూపటి సుధాకర్, యాకూబ్‌రెడ్డి, శ్రీనివాస్, సుభాషిణి, లక్ష్మణ్, నిజాం, వ్యాయామ ఉపాధ్యాయులు సతీశ్, యుగేందర్, సుధాకర్‌రావు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి

ఖిలా వరంగల్ : క్రీడాకారులు తమలోని ప్రతిభాపాటవాలను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి, ఓరుగల్లు కీర్తిని చాటాలని ప్రముఖ సామాజికవేత్త మేరుగు అశోక్ ఆకాంక్షించారు. ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో వరంగల్‌కు చెందిన గ్రీన్ వారియర్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్, డాక్టర్ శ్రవణ్, ఇతరుల సహకారంతో మూడురోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లాల వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా అశోక్ హాజరై మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. శారీరక, మానసిక వికాసానికి సైతం క్రీడలు దోహదం చేస్తాయని వివరించారు. అనంతరం విజేతగా నిలిచిన కాశిబుగ్గ వినయ్ జట్టుకు చాంపియన్ షిప్ ట్రోఫి అందజేశారు. ఈ సందర్భంగా కొత్తవాడ టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచింది.